క్లుప్తంగా

సింగరేణి అభివృద్ధికి కృషి చేసే వారికే ఓటు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి భవిష్యత్, అభివృద్ధికి కృషి చేసే వారికే కార్మికులు ఓటు వేస్తారని హెచ్ఎంఎస్ కొత్తగూడెం ఏరియా బ్రాంచి సెక్రటరీ ఆసిఫ్ తెలిపారు. కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల ఓట్లతో గెలుస్తున్న నాయకులు ఆతర్వాత సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఫలితంగా కొత్త గనులు రాక, పాత గనులు మూతపడి ఉపాధి కరువవుతోందని తెలిపారు. ఈసారైనా కార్మికుల కష్టాలపై స్పష్టమైన హామీ ఇచ్చేవారికే ఓట్లు వేస్తామని ఆసిఫ్ వెల్లడించారు. ఈ సమావేశంలో చంద్రశేఖర్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు వైద్యఖర్చులు చెల్లించాలి


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): రిటైర్డ్ సింగరేణి కార్మికులకు క్లిష్టమైన వ్యాధుల చికిత్స కోసం కోలిండియా మాదిరి ఎలాంటి ఆంక్షలు లేకుండా నగదు చెల్లించాలని బీఎంఎస్ నాయకులు కోరారు. పి.మాధవనాయక్ ఆధ్వర్యాన బుధవారం జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) బి.హన్మంతరావుకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. గుండె జబ్బులు, కిడ్నీ, కేన్సర్, పక్షవాతం తదితర వ్యాధుల చికిత్సకు నగదు అవసరమైన మేర చెల్లించాలని, కోలిండియాలో మాదిరి ఈ విధానం అమలు చేసేలా సర్క్యులర్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవీ కృష్ణారెడ్డి, పెల్లి రాజేశ్వరరావు, సుందర్‌రావు, రాంసింగ్ పాల్గొన్నారు.

మలేరియా సర్వే


సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు వర్షాకాలంలో వచ్చు మలేరియాను ముందుగా గుర్తించేందుకు అసింటోమేటిక్ ఫీవర్ సర్వే నిర్వహించడం జరుగుతుందని రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఈట స్వప్న తెలిపారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బంగారుచలక ఉప ఆరోగ్య కేంద్రం గొల్లగూడెం గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. స్వప్న మాట్లాడుతూ.. అందరి రక్తపూతలు సేకరించి ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

వితరణ


ప్రిన్సిపాల్‌కు బ్యాటరీలను అందిస్తున్న దేవేందర్

పాల్వంచ: పట్టణంలోని కేఎల్ఆర్ క్యాంపస్‌లోని కొత్తగూడెం తెలంగాణ వెల్ఫేర్ డిగ్రీ బాలికల కళాశాలకు ఇన్వర్టర్ బ్యాటరీలను బుధవారం వితరణగా అందించారు. మండలంలోని మొండికట్ట గ్రామానికి చెందిన గండికోట దేవేందర్ తన తల్లి గండికోట అయిలమ్మ వర్ధంతి సందర్భంగా రూ.24వేల విలువ చేసే రెండు బ్యాటరీలను రిటైర్డ్ ఉపాధ్యాయులు మల్లికార్జున్ చేతులు మీదుగా అందించారు. ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఏఓ కృష్ణ పాల్గొన్నారు.

సింగరేణి ఆస్పత్రిలో నామమాత్రపు సేవలే...

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ఆస్పత్రిలో కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన సేవలందడం లేదని ఏఐటీయూసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వంగా వెంకట్ ఆరోపించారు. ఏఐటీయూసీ నాయకులు బుధవారం ఆస్పత్రిని పరిశీలించగా పలు సమస్యలు వెల్లడయ్యాయని ఆయన తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని లోపలకు తీసుకెళ్లేలా వీల్‌చైర్లు, స్ట్రెచర్లు సరిపడా లేకపోగా.. ఒకవేళ ఉన్నా సిబ్బంది లేకపోవడంతో కుటుంబీకులలే తీసుకెళ్లాల్సి వస్తోందని చెప్పారు. అంతేకాక అటెండెంట్లు లేరని, ఆస్పత్రి ఆవరణలో తాగునీటి వసతి లేకపోగా..కోతులు, కుక్కల బెడద వేధిస్తోందని తెలిపారు. ఆస్పత్రిలో రాజ్యమేలుతున్న సమస్యలపై త్వరలోనే ఉద్యమాలు చేపడతామని వెంకట్ తెలిపారు.

అగ్రస్థానంలో మైనార్టీ గురుకులం

- క్రమశిక్షణ, ఆటపాటలతో మెరుగైన విద్యాబోధన
- ఇంటర్‌లో ఏటా ఉత్తమ ఫలితాలు


పాఠాలు వింటున్న విద్యార్థులు (ఫైల్)

ఇల్లెందు: అనుభవం కలిగిన అధ్యాపకులు, ప్రిన్సిపాల్ పర్యవేక్షణ, విద్యార్థుల క్రమశిక్షణ, ఆటపాటలతో మెరుగైన విద్యా బోధన అందుకున్న ఇల్లెందులోని తెలంగాణ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల ఫలితాల్లో ఈ ఏడాది అగ్రస్థానంలో నిలిచింది. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాలలో తెలంగాణ మైనార్టీ గురుకులంలో ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థి ఎస్కే హఫీజ్ 466/470 మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించాడు. అదేవిధంగా ఎస్కే అర్షద్ 454/470, ఈశ్వర్ 447/470, రోహిత్ 427/470, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో వంశీ 935/1000, అప్సర్ 866/1000 మార్కులు సాధించారు. 2023–24 విద్యా సంవత్సరంలో బైపీసీలో ఏడుగురు, ద్వితీయ సంవత్సరంలో ఏడుగురు, ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 32 మంది, ద్వితీయ సంవత్సరంలో 13 మంది మొత్తం 59 మంది విద్యార్థులు ఉన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 204 పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. ఫలితాల్లో ఇల్లెందు మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల తమ ప్రతిష్టను నిలుపుకుంది.

సీట్ల కేటాయింపు..

ఇల్లెందు తెలంగాణ మైనార్టీ జూనియర్ కళాశాలలో బైపీసీ, ఎంపీసీ గ్రూపులు ఉన్నాయి. ఉత్తమ ఫలితాలు సాధించే అధ్యాపకుల బోధనలో కళాశాల సాగుతోంది. ప్రతీ గ్రూపులో 40 మందికి కళాశాలలో చేరే అవకాశం ఉంది. మైనార్టీలకు 30 సీట్లు, ఇతరులకు 10 సీట్లు ఉన్నాయి.

కళాశాల ప్రత్యేకతలు..

క్రమశిక్షణ, నాణ్యమైన విద్య, అనువజ్ఞులైన అధ్యాపకుల బృందంచే బోధన, ప్రత్యేక హాస్టల్ వసతి, నిరంతర పర్యవేక్షణ, ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ, అసాధారణ ఫలితాల సాధన, అత్యాధునిక పరికరాలతో ప్రయోగశాలల ఏర్పాటు, నిర్వహణ, వ్యక్తిత్వ వికాసం కోసం ప్రత్యేక సెమినార్లు, యోగా తరగతులు, మైనార్టీ తరగతుల వారికి అరబిక్ తరగతులు, రోజులో ఐదుసార్లు నమాజ్ చేసుకునే అవకాశం, మెరుగైన ఆరోగ్య సేవలు అందించటం, క్రీడలకు ప్రాధాన్యం, గ్రంథాలయ నిర్వహణ, యూనిఫాం, షూస్, కాస్మొటిక్స్ కిట్స్, బ్లాంకెట్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ప్లేట్స్ ఉచితంగా అందజేత. అల్పాహారం, రెండు పూటలా భోజనం, మెనూ పాటింపు, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, మంచినీటి సదుపాయం, సీసీ కెమెరాల పర్యవేక్షణ, ప్రతీ విద్యార్థికి బంకర్ బెడ్ విత్ లాకర్ సదుపాయం.

సుందరంగా అలంకరించిన కళాశాల..

2022–23 విద్యాసంవత్సరంలో తహసీల్‌కు సమీపంలో విశాలమైన భవనంలో గురుకుల జూనియర్ కళాశాల సాగుతోంది. నీటి సదుపాయం, మరుగుదొడ్లు, స్నానపు గదులు, తరగతి, నివాస గదుల్లో విద్యుత్ సౌకర్యం, వంట కోసం షెడ్లు, విద్యార్థుకు బెడ్ సౌకర్యం, తాజా కూరగాయలు, మెనూ ప్రకారం ఆహారం అందించటం, అవసరమైన విద్యార్థులకు వైద్యం అందించేందుకు ఏఎన్ఎంను నియమించారు. విద్యార్థులకు విటమిన్, జింక్, నులిపురుగుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన చాక్‌లెట్‌లు అందజేస్తున్నారు. బయోమెట్రిక్, ఫేస్ ఐడీ ద్వారా రోజువారీ హాజరు నమోదు, గేటు వద్ద సెక్యూరిటీ, తల్లిదండ్రులు తమ పిల్లలతో యోగక్షేమాలు తెలుసుకునేందుకు అనుమతి పొందటం లాంటి నియమ నిబంధనలతో క్రమశిక్షణలో అగ్రస్థానంలో ఉంది. చుట్టూ ప్రహరీ, విద్యార్థులు బయటకు వెళ్లకుండా సెక్యూరిటీ ఏర్పాటు చేశారు.


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వసతి బావుంది..



మైనార్టీ గురుకులంలో క్రమశిక్షణ, ఉత్తమ బోధన, మెరుగైన సదుపాయాలు అందిస్తున్నారు. పేదవర్గానికి చెందిన తమ లాంటి ఎంతోమంది మైనార్టీ విద్యార్థులు గురుకులాలలో చదువుకుంటున్నారు. వారికి బోధనతో పాటు ఉచిత ఆహారం, పాఠ్యపుస్తకాలు అందించటం వల్ల స్టేట్ ర్యాంకు సాధించాను.

– ఎస్కే హఫీజ్, విద్యార్థి, స్టేట్ 3వ ర్యాంకు

మంచి ఫలితాలు వస్తున్నాయి..



నిరంతర బోధన, ప్రతీ విద్యార్థి మీద ప్రత్యేక శ్రద్ధ మంచి ఫలితాలు వస్తున్నాయి. తెలంగాణ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో మెరుగైన ఫలితాలు లభించాయంటే ఇక్కడి బోధన తీరే కారణం. తల్లిదండ్రులకు దూరంగా ఉండే విద్యార్థుల పట్ల అన్ని విషయాలలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

– వంశీ, ఎంపీసీ, ద్వితీయ సంవత్సరం, ఇల్లెందు

ఒక్కో విద్యార్థిపై రూ.లక్ష ఖర్చు..



అల్పసంఖ్యాక వర్గాల బాలుర గురుకుల కళాశాలలో ఎంపీసీ/బైపీసీలో 40/40 సీట్లు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి విద్యార్థులు నేరుగా ధ్రువపత్రాలతో వస్తే సీట్లుకేటాయిస్తాం. ఎలాంటి పరీక్షలు లేకుండా సీట్లు ఇచ్చి మెరుగైన విద్య అందిస్తాం. ఏటా ఒక్కో విద్యార్థిపై తెలంగాణ ప్రభుత్వం రూ.లక్ష వరకు ఖర్చు చేస్తోంది.

– ముద్దసిర్ హుస్సేన్, ప్రిన్సిపాల్

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం


కొత్తగూడెంఅర్బన్: ప్రచారం చేస్తున్న నాయకులు


జూలూరుపాడులో...

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు అన్నారు. బుధవారం పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మార్కెట్ ఏరియాలో కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో బద్ది కిశోర్, భట్టు మురళీ, హుస్సేన్ నాయక్, ఓలపల్లి రాంబాబు, సాంబయ్య, ఇమ్మానియేల్, లింగ్యా నాయక్, లక్ష్మణ్, భార్గవ్, అబ్దుల్లా, సూర్య, సోమయ్య, ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండలంలో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో భారీగా కాంగ్రెస్‌లో చేరుతుండగా, మరోవైపు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇంటింటి ప్రచారం చేస్తూ జోరు పెంచారు. ప్రచారంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, నున్నా రంగారావు, నర్వనేని పుల్లారావు, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, యల్లంకి పుల్లయ్య, మాచినేని సత్యనారాయణ, వేల్పుల నరసింహారావు, సాయిల కృష్ణయ్య, మోదుగు రామకృష్ణ, పోతురాజు నాగరాజు, మోదుగు సుగుణరావు, పణితి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని వార్డుల్లో ఎన్నికల ప్రచారాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం 23వ వార్డు కూలీలైన్‌లో మిత్రపక్షాలు బలుపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘురాంరెడ్డికి ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు.

కాంగ్రెస్ నాయకుడు కోనేరు చిన్ని మాట్లాడుతూ... దేశాన్ని కులమతాల పేరుతో విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణని అప్పుల కుప్ప చేసి, ప్రజలపై భారం మోపిన బీఆర్ఎస్ పార్టీని ఓడించి దేశం కోసం, దేశ ఐక్యత కోసం మిత్రపక్షాలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో డాక్టర్ శంకర్‌నాయక్, జేవీఎస్ చౌదరి, దేవీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

‘కూటమి’ అభ్యర్థులను గెలిపించండి


మాట్లాడుతున్న ఉమర్

జూలూరుపాడు: లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్కే ఉమర్ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం జూలూరుపాడులో జరిగిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతోన్మాద ముసుగులో రాజకీయాలు చేస్తున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో దేశంలో నిరుద్యోగ, రైతాంగ సమస్యలు పెరిగాయన్నారు. నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపిందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఇండియా కూటమి అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వల్లోజి రమేష్, కల్తి నరసింహారావు, బత్తుల గోపి, జవ్వాది నరసింహారావు, రామయ్య, సీతయ్య పాల్గొన్నారు.

మోదీ హామీలను విస్మరించారు..


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్డీ నాయకులు

ఇల్లెందు: 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని, విప్లవ పార్టీ అభ్యర్థి మోకాళ్ల మురళీ కృష్ణను గెలిపించాలని ఎన్డీ నేతలు పిలుపునిచ్చారు. బుధవారం ఇల్లెందులోని గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా నుంచి గోవింద్ సెంటర్ వరకు రోడ్ షో నిర్వహించారు. మురళీ కృష్ణ కుండ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎన్డీ కేంద్ర కమిటీ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు,టీ.శ్రీనివాస్, కె.గోవర్ధన్‌లు పిలుపునిచ్చారు. మాట్లాడుతూ.. కేంద్రంలో పదేళ్లగా రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబించారని తెలిపారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా కట్టబెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో ఎన్డీ రాష్ట్ర నాయకులు గౌనీ ఐలయ్య, తుపాకుల నాగేశ్వరరావు, జడ సీతారామయ్య, బండారీ ఐలయ్య, సారంగపాణి, యాకన్న, పొడుగు నర్సింహారావు, గౌని నాగేశ్వరరావు, అనురాధ, తోడేటి నాగేశ్వరరావు, డి.ప్రసాద్, నందగిరి వెంకటేశ్వర్లు, ఎండీ రాసుద్దీన్, ఎల్.విశ్వనాథం పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం..


ఇల్లెందు: సంజయ్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం

ఇల్లెందు: కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ పట్టణంలోని 8వ, 15వ వార్డులో ఆజాద్‌నగర్, సంజయ్‌నగర్, ఇందిరానగర్‌లో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బోగ నందకిషోర్, సుదర్శన్ కోరీ, పులి సైదులు ప్రచారంలో పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: పోరిక బలరాంనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ సంజయ్‌నగర్, ఆజాద్‌నగర్, మిట్టపల్లి గ్రామాలలో బుధవారం కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి ఓటు అభ్యర్థించారు. ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆగస్టు నాటికి రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పులి సైదులు, పాయం స్వాతి, గుగులోత్ నాగార్జున్, బాబూరావు, పోషయ్య పాల్గొన్నారు.

టేకులపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి వామపక్షాలు బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా దేవానాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లిలోని పార్టీ కార్యాలయంలో మండలస్థాయి జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. ఈసం నర్సింహారావు, కడుదుల వీరన్న, పూనెం స్వామి, కుంజ రమేష్, దినసరి వీరాస్వామి, పూనెం చంద్రశేఖర్, దొడ్డ సావిత్రి, గుమ్మడి ఎర్రయ్య పాల్గొన్నారు.

ప్రసాద్‌కు డాక్టరేట్



ఇల్లెందు: కృషి, పట్టుదలతో ఇల్లెందు యువకుడు ఫార్మసీలో డాక్టరేట్ సాధించారు. పట్టణంలోని 14వ నెంబర్ బస్తీకి చెందిన మీరబోయిన సత్యం- పార్వతి దంపతులు కుమారుడు మీరబోయిన ప్రసాద్ చెన్నైలోని వేల్స్ యూనివర్సిటీలో ఫార్మసీ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ఇటీవల ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ పట్టా అందజేశారు. చిన్నతనం నుంచి చదువులో పట్టుదల, కృషి నిరంతర శ్రమ, తన సోదరుడు సింగరేణిలో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌గా పనిచేస్తూ ఇంజనీర్‌గా పదోన్నతి పొందిన మీరబోయిన నాగరాజు ప్రోత్సాహంతో సాధించినట్లు ప్రసాద్ తెలిపారు. డాక్టరేట్ రావటం పట్ల పట్టణానికి చెందిన పలువురు అధికారులు, రాజకీయ నాయకులు, స్నేహితులు అభినందించారు.

లారీ డ్రైవర్ అదృశ్యం


బాబూరావు (ఫైల్)

పాల్వంచరూరల్: లారీ డ్రైవర్ అదృశ్యమైయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు... మండల పరిధి జగన్నాథపురం గ్రామానికి చెందిన లారీడ్రైవర్‌గా పనిచేస్తున్న ధరావతు బాబూరావు (34) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదని భార్య శాంతి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్రజా హక్కులను కాపాడుకుందాం..


మాట్లాడుతున్న సతీష్

సింగరేణి(కొత్తగూడెం): మతోన్మాద ఫాసిస్ట్ కార్మిక వ్యతిరేక బీజేపీ మిత్రపక్షాలను ఓడించాలని, లౌకిక ప్రజాతంత్ర హక్కులను కాపాడుకుందామని, పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపిద్దామని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర కార్యదర్శి సతీష్ కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం కొత్తగూడెం ఏరియాలోని వివిధ ప్రాంతాలలో కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశం నిర్వహించి, ఎన్నికల కరపత్రాలను విడుదల చేశారు. మాట్లాడుతూ.. ఈనెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ కుటిల యత్నాలకు పాల్పడుతోందని, గత ఎన్నికలలో ప్రజలకు, కార్మికలకు ఇచ్చిన వాగ్దానాలను గాలికొదిలేసిందని విమర్శించారు. ఇంధనం, నౌకాశ్రయాలు, విమానయానం, సహజ నిక్షేపాలు, ఖనిజాలన్నింటినీ, ప్రభుత్వ రంగ సంస్థలను దేశ, విదేశీ కార్పొరేట్ వర్గాలకు కారు చౌకగా కట్టబెట్టిందని ఆరోపించారు. పబ్లిక్ సెక్టార్‌ను ధ్వంసం చేసిందని చిన్న పరిశ్రమలను మోసం చేసిందని, రెండోసారి అధికారంలోకి వచ్చాక ఈ దూకుడును మరింత పెంచిందన్నారు. కార్యక్రమంలో వై.గోపాలరావు, కృష్ణ, నాగలక్ష్మి, సంధ్య, కరుణ, భగవాన్, విజయ్, పద్మ, మంగ, రామకృష్ణ, నరసమ్మ, రమణ, దాసు, భూషణం, శాంత పాల్గొన్నారు.

మరోసారి మోదీని ప్రధానిని చేద్దాం..


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లా అభివృద్ధి చెందాలంటే ఖమ్మం పార్లమెంట్‌కు ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాండ్ర వినోద్‌రావును గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్ కోరారు. స్థానిక దమ్మపేట సెంటర్‌లో బుధవారం రాత్రి స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించి మరోసారి మోదీని ప్రధానమంత్రిగా చేయాలన్నారు. ఈ సమావేశంలో పొనిశెట్టి వెంకటేశ్వర్లు, చిర్ర సరస్వతి, ఆకుల నాగేశ్వరరావు, ముక్కెర కోటేశ్వరి, కె.రజింత్, ఎం.లక్ష్మణ్, బి.వెంకటేశ్వర్లు, నరేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వినోద్‌రావును గెలిపించాలి..

ఖమ్మం పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు బుధవారం స్థానిక కేటీపీఎస్ సెంట్రల్ కార్యాలయంలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చింతలచెరువు శ్రీనివాసరావు, రాపాక రమేష్, గంధం నాగేంద్రప్రసాద్, భీమల్ జైన్, మురళి, వంశీప్రసాద్, అవినాష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలి..



చుంచుపల్లి: బాబూక్యాంపులో ప్రచారం చేస్తున్న నాయకులు, ఇల్లెందులో...

చుంచుపల్లి: ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ బుధవారం ఎంపీటీసీ కూసన వీరభద్రం ఆధ్వర్యంలో బాబు క్యాంప్‌లోని 199, 200 బూత్ లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది.. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆరోపించారు. ఎలుక చందర్, ఎల్లండి సదామోహన్, శివ, రవి, యోగానందం నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణం 35వ వార్డులో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ 35వ వార్డులో వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

ఇల్లెందు: మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాలోతు కవిత గెలుపును కాంక్షిస్తూ పట్టణంలోని 16, 21 వార్డులలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు పాల్గొని కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గిన్నారపు రాజేష్, అబ్దుల్ నబీ, దిండిగల రాజేందర్, జేకే శ్రీను, రాచపల్లి శ్రీను, చాంద్‌పాషా, ముత్తయ్య, శ్రీరామ్, రాము తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణ, రక్షణ సూత్రాలు..



టేకులపల్లి: అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం అవస్థలు పడుతున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు ఎండతాకిడికి తట్టుకోలేకపోతున్నారు. వేసవిలో ఎండ తీవ్రత నేపథ్యంలో లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ పలు విషయాలు తెలియజేశారు. వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రత, వేడిగాలులు కారణంగా వడదెబ్బ, డీహైడ్రేషన్ సాధారణంగా వచ్చే వ్యాధులు, సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకం అవుతుందని తెలిపారు. వేసవిలో నీరు, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, పండ్లు, మజ్జిగ, పండ్ల రసాలు వీలైనన్ని ఎక్కువసార్లు తీసుకోవాలని సూచించారు.

వడదెబ్బ లక్షణాలు..

చెమట పట్టకపోవడం, వణుకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింతలు, శరీర ఉష్ణోగ్రత పెరగడం ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితికి చేరుకోవడం.

చేయాల్సినవి...

నీరు, పళ్లరసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. లేతవర్ణం, తేలికైన, కాటన్ దుస్తులు ధరించాలి. రోజూ కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. రెండు పూటలూ స్నానం చేయాలి. ఇంటి భోజనానికే ప్రాధాన్యత ఇవ్వాలి. మితంగా తినాలి. ఎండలో ఇంటి పట్టునే ఉండాలి. బయటికి వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి వంటివి తీసుకెళ్లాలి.

చేయకూడనివి...

మండు వేసవిలో, తీవ్ర ఉష్ణోగ్రత సమయంలో ఎక్కువగా బయట తిరగరాదు. సూర్యకిరణాలకు, వేడిగాలికి గురికావొద్దు. రోడ్ల మీద చల్లని, రంగు పానీయాలు తాగరాదు. రోడ్ల మీద అమ్మే కలుషిత ఆహారం తినకూడదు. మాంసాహారం తగ్గించాలి. మద్యం సేవించరాదు. ఎండవేళల్లో శరీరంపై భారం పడే శ్రమగల పనులు చేయరాదు. నలుపు, మందముగా వున్న దుస్తులు ధరించరాదు.

ప్రథమ చికిత్స ...


కందుల దినేష్, వైద్యాధికారి, సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడకు చేర్చాలి. చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చేస్తుండాలి. ఫ్యాను గాలి / చల్లని గాలి తగిలేలా ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిగిన గ్లూకోజు ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణము (ఓఆర్ఎస్) తాగించవచ్చు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. ఇంట్లో కిటికీలు తెరిచి ఉంచాలి. వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.